
క్లుప్తంగా

ఘనంగా గణేష్ నిమజ్జనాలు



దేవరాపల్లిలో భారీ భక్త జనం నడుమ వినాయకుడి విగ్రహం ఊరేగింపు

దేవరాపల్లి: మండలంలోని దేవరాపల్లి, కొత్త పెంట గ్రామాలలో వినాయక నిమజ్జన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. దేవరాపల్లిలో సినిమా థియేటర్ వద్ద సన్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక నిమజ్జన మహోత్సవాన్ని నేల వేషాలు, దేవతా మూర్తుల వేషధారణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సినిమా థియేటర్ నుంచి నాలుగు రోడ్ల మీదుగా ప్రధాన రహదారిలో వినాయక విగ్రహం ఊరేగింపు సాగింది. అనంతరం స్థానిక శారదానదిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కొత్తపెంటలో వినాయక విగ్రహ నిమజ్జన మహోత్సవాన్ని పలు సాంస్కృతి కార్యక్రమాలు నడుమ ఘనంగా నిర్వహించారు.

ఘనంగా కోటకొండమ్మతల్లి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గొలుగొండ : చోద్యం గ్రామంలో మంగళవారం కోటకొండమ్మతల్లి జాతర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో భక్తులు అంతా అమ్మవారిని దర్శించుకోవడం కోసం బారులు తీరారు. ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి జాతరను పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ అలంకరణ, బాణాసంచా నడుమ రాత్రి అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



విద్యార్థులతో పీడీ కొండబాబు, ఉపాధ్యాయులు

రోలుగుంట : బుచ్చింపేట హైస్కూలు నుంచి స్కూల్ గేమ్స్‌లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి విద్యార్థులు ఎంపికైనట్టు ఆ పాఠశాల పీడీ కొండబాబు తెలిపారు. రోలుగుంట జెడ్పీ స్కూల్లో ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు కేజీబీవీతో పాటు మిగిలిన జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఎనిమిదితో కలిపి తొమ్మిది పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొన్నారు. బుచ్చింపేట విద్యార్థులు ఆటల్లో ప్రతిభ చూపించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిని హెచ్ ఎం శేఖర్, పీడీ కొండబాబు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటరమణ అభినందించారు.

డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

చోడవరం రూరల్ : విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలను అలవరచుకోవడం కోసమే జాతీయ సేవా పథకం ఆవిర్భవించిందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాలలోని మూడు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1969లో సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ ఆవిర్భవించిందని చెప్పారు. వచ్చే నెల 2 వరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

వడ్డాదిలో ముగిసిన స్కూల్ గేమ్స్

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ముగిశాయి. మొదటిరోజు సోమవారం బాలికలకు ఆటల పోటీలు నిర్వహించగా మంగళవారం బాలురకు నిర్వహించారు. రెండో రోజు బాలురకు కబడ్డీ,వాలీబాల్,ఖోఖో, షటిల్ బాడ్మింటన్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. గున్నెంపూడి, రాజాం,సీతయ్యపేట, పెదమదీన, విజయరామరాజుపేట, వడ్డాది, దిబ్బిడి, తురకలపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు.



ఇరిగేషన్ స్థలంలో సొంత నిధులతో తాటాకు పాకలు వేసుకుని సంతలో విక్రయాలు చేస్తున్న వ్యాపారులు



రోడ్డుపై సంత నిర్వహణతో ట్రాఫిక్ సమస్య

వారపు సంతలో అసౌకర్యాల చింత

- సంతవేలం పాట ద్వారా వేలాది రూపాయల ఆదాయం
- వసతులు లేక వ్యాపారుల అవస్థలు
- 50పైగా గ్రామాలకు ఈ సంత ఆధారం

ప్రభుత్వానికి ఇక్కడి వారపు సంత వేలం పాట ద్వారా వేలాది రూపాయలు ఆదాయం వస్తున్నా సంత కోసం సరైన వసతులు కల్పించడం లేదు. వ్యాపారులకు సంతలో సరైన వసతి సముదాయం లేక రోడ్డుపైనే తాత్కాలిక పాకల్లో ఎండలోనూ, వానల్లోనూ ఇక్కట్లు పడుతున్నారు. దాదాపు 50 గ్రామాల ప్రజలు నిత్యావసర సరకుల కొనుగోలుకు ఈ వారపు సంతకు వస్తుంటారు.



ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సంత నిర్వహణ

నాతవరం : మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారపు సంత నిర్వహిస్తుంటారు. మండల వాసులంతా ఈ సంతలో వారానికి సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోళ్లు జరుపుతారు. ఈ వారపు సంత వేలం పాట ద్వారా మండల పరిషత్ కార్యాలయానికి ఏడాదికి రూ. 70 వేలు నుంచి రూ.80వేలు మధ్య అదాయం వస్తుంది. ప్రతి ఏటా మార్చి నెలలో ఎంపీడీవో ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. వారపు సంత మొదట్లో నాతవరం గ్రామ శివారు గుమ్మడిగొండ వెళ్లే దారిలో ప్రభుత్వానికి చెందిన స్థలంలో నిర్వహించేవారు. ఆ స్థలంలో షెడ్లు నిర్మించేందుకు అధికారులు వారపు సంతను నాతవరం ప్రధాన కూడలి జంక్షన్ తాండవ వెళ్లే అర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఇరిగేషన్ స్థలంలోకి మార్పు చేశారు. కొంతకాలంగా ప్రతి మంగళవారం వారపు సంత వ్యాపారులు ఇరిగేషన్‌కు చెందిన స్థలంలోనే నిర్వహిస్తూ ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ ఎలాంటి వసతి సముదాయాలు ఏర్పాటు చేయలేదు. ఎండ కాచిన వర్షం పడిన వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంత నిర్వహించే స్థలంలో కొందరు వ్యాపారులు సొంత ఖర్చుతో తాత్కాలికంగా తాటాకు పాకలు వేసుకొని మంగళవారం క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. మిగిలిన వారు ఆరు బయట ఎండలోనే రోడ్డు మార్జిన్‌లో దుకాణాలు పెట్టి విక్రయాలు జరుపుతున్నారు. సంత నిర్వహించే ప్రదేశంలో ఒక వైపు లోతైన గెడ్డ మరో వైపు నిండుగా నీటితో చెరువు ఉంది. మధ్యలోంచి అర్అండ్‌బీ రోడ్డు ఉండడంతో సంతకు వచ్చే వినియోగదారులు, వ్యాపారులు వసతి సమస్యతో అల్లాడిపోతున్నారు. సాయంత్రం 3 గంటల నుంచి వాహనాలు రద్దీ అధికంగా ఉండడంతో ప్రతి మంగళవారం వారపు సంతలో ట్రాఫిక్ సమస్యతో సతమతం అవుతున్నారు. మండల పరిషత్ అధికారులు వారపు సంత ద్వారా అదాయం పొందుతున్నారు తప్ప మౌలిక సదుపాయాలు కల్పించడంపై కనీసం దృష్టి సారించడం లేదు. ప్రతి మంగళవారం సరుగుడు, సుందరకోట, కె.వి.శరభవరం గిరిజన పంచాయతీలు శివారు 25 గ్రామాలు మైదాన ప్రాంతంలో 30 పైగా గ్రామాల ప్రజలు ఈ సంతపై అధారపడుతుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దృష్టి సారించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బంది ఉంది..



ప్రతి మంగళవారం వారపు సంతకు కాయకూరలు కొనుగోలు చేయడానికి వెళ్లేవారు విక్రయాలు చేసే వ్యాపారులు అనేక బాధలు పడుతున్నారు. ఆ రోజు తాండవ వెళ్లే వాహనదారులు ట్రాఫిక్‌లో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి అదాయం వస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించలేదు. అధికారులు స్పందించకుంటే అందోళన చేస్తాం.

-అడిగర్ల రాజు, సీపీఎం మండల శాఖ కార్యదర్శి

సమస్య పరిష్కారానికి కృషి



మంగళవారం నిర్వహించే వారపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దృష్టి సారిస్తా. గతంలో నిర్వహించే పాత సంత స్థలంలోనే నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. ప్రత్యేకంగా షెడ్లు నిర్మించే ఆలోచన గతంలో చేశాం. దానిని మరలా పరిశీలించి చర్యలు చేపడతాం.

- హనుమంతరావు, ఎంపీడీవో నాతవరం

అధిక దిగుబడులకు 'పొలం పిలుస్తోంది'



వ్యవసాయశాఖ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి రామారావు ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావుతో సిబ్బంది పొలాలు తిరిగి ప్రస్తు తం ఖరీఫ్ వరి చేలుకు ఆశిస్తున్న పొడతెగుళ్లు, దోమల నివారణ చర్యలపై రైతులకు వివరించారు.

గొలుగొండ: రసాయనక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి, దిగుబడులు బాగా పెరుగుతాయని వ్యవసాయశాఖ అధికారి సుధారాణి తెలిపారు. పాతమల్లంపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

నర్సీపట్నం : ధర్మసాగరం, ఓఎల్‌పురం గ్రామాల్లో వ్యవసాయశాఖ వారు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పొలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీవో హెచ్.వి.జయరాం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో వ్యయం తగ్గించి అధిక దిగుబడులు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆర్డీవో పరిశీలించారు. జెడ్పీటీసీ రమణమ్మ, సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, వ్యవసాయశాఖ ఏడీ శ్రీదేవి పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : మండలంలోని రేవళ్ల సాగునీటి కాలువ సమస్యను పరిష్కరిస్తామని మంగళవారం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పలు శాఖల అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు రవీంద్రనాథ్, మండల వ్యవసాయాధికారి పావని, ఏఈవో కిరణ్, ఎంపీఈవో మౌనిక, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : నీరు వృథా కాకుండా నేరుగా మొక్కలకు నీరందించే డ్రిప్ సేద్యం, స్ప్రింకర్ల సేద్యంపై రైతులు దృష్టి సారించాలని సూక్ష్మ, బిందు సేద్యం అసిస్టెంట్ డైరెక్టర్ జి. లక్ష్మి అన్నారు. మారేపల్లి, చేనులపాలెంలో గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రిప్ సేద్యం, స్ప్రింకర్ల సేద్యం విధానంలో సాగు చేపట్టడం ద్వారా తక్కువ నీటిలో మంచి ఫలితాలు పొందవచ్చునని రైతులకు వివరించారు. ఏవో వై. కాంతమ్మ మాట్లాడుతూ ప్రతి రైతు బాధ్యతగా రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కన్నతల్లి, ఎంపీటీసీ రమాదేవి, ఉప సర్పంచ్ కన్నంనాయుడు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా తరలించాలి

నర్సీపట్నం: గమ్యస్థానాలకు ప్రయాణికులను సురక్షితంగా తరలించాలని టౌన్ ఎస్సై రమేష్ ఆటో డ్రైవర్లకు సూచించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు ఎస్ఐ పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించకుండా ఆటోలను తిప్పాలన్నారు. టౌన్ ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని ఎక్కడబడితే అక్కడ నిలపకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే ఆటోలను నిలపాలన్నారు. స్కూల్ పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లేటప్పుడు, ఇళ్లకు చేర్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

దేవరాపల్లి : ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు అన్నారు. బోయిలకింతాడ సచివాలయంలో సర్పంచ్ బూరె బాబురావు అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు రూ. 98 లక్షలతో లేబర్, మెటీరియల్ కాంపోనెంట్‌తో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృంద తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీలో గుర్తించిన పలు అంశాలను సభలో వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో భారీ వర్షం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి వరకు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. భారీ వర్షంతో వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట, రాజాం జంక్షన్ రోడ్లపై నుండి వర్షం నీరు ప్రవహించింది. ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో వాహనదారులకు రోడ్లు కనిపించక పలువురు వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు, కాలేజీ, పాఠశాలల విద్యార్థులు వర్షంలో తడుస్తూ ఇళ్లకు చేరారు. పలు గ్రామాల్లో చెట్టు కొమ్మలు విరిగిపడగా కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన గవరవరం



విజేతలతో ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అదరగొట్టారు. 100, 200, 800 మీటర్ల పరుగు పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానలను షాట్‌పుట్, లాంగ్ జంప్‌లలోను తమ ప్రతిభను చాటారు. పాఠశాల విద్యార్థి పి.సురేందర్ వంద మీటర్ల పరుగులో తృతీయ, లాంగ్‌జంప్‌లో చతుర్థ స్థానాలను, ఎస్.వెంకటేష్ వంద మీటర్ల పరుగులో ప్రథమ, 400 మీటర్లలో మూడో స్థానాలలో నిలిచాడు. ఎం.హేమసాయి వంద మీటర్ల పరుగులో ద్వితీయ, లాంగ్ జంప్‌లో ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానాలను పొందగా, పి.సాయిదేవి వంద మీటర్ల పరుగులో తృతీ, షాట్‌పుట్‌లో ప్రథమ, 800 మీటర్లలో ద్వితీయ స్థానాలను పొందారు. ఎస్. మధుశ్రీ 200 మీటర్ల పరుగులో తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె. సుందర్‌సింగ్ మంగళవారం తెలిపారు. వీరంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. సత్తాచాటిన విద్యార్థినీ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని సహ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మండల స్థాయి క్రీడల్లో ఎ.కొత్తపల్లి విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఎ.కొత్తపల్లి హైస్కూల్ హెచ్ఎం స్వర్ణలత

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ఎ. కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఆయా క్రీడాకారులను స్థానిక హైస్కూల్లో మంగళవారం హెచ్ఎం వై. స్వర్ణలత అభినందించారు. అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీలో విజేతగాను, ఖోఖోలో ద్వితీయ స్థానంలోను, బాలుర కబడ్డీలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-14లో బాలికల కబడ్డీ, ఖోఖో, చెస్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అథ్లెటిక్స్ విభాగంలో త్రోస్‌లో బాలబాలికలు 16 మెడల్స్‌ను, రన్నింగ్‌లో 8 మెడల్స్‌ను, జంపింగ్‌లో రెండు మెడల్స్ సాధించారని హెచ్ఎం స్వర్ణలత తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పి.అఖిల 8 మెడల్స్‌ను, ఎనిమిదో తరగతి విద్యార్థి పి. సాయికుమార్ 6 మెడల్స్‌ను సాధించారన్నారు.

ఎన్ఆర్ఎస్‌టీసీ పాఠశాల సందర్శన



లోసింగిలో ఎన్ఆర్ఎస్‌టీసీ పాఠశాలను ఆ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ గోవిందరావు

రోలుగుంట : మండలంలో ఆదివాసీ గిరిజన గ్రామాల వారి కుటుంబాల పిల్లల కోసం నిర్వహిస్తున్న ఎన్ఆర్ ఎస్‌టీసీ పాఠశాలను ఆ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్.గంగాధర్ మంగళవారం సందర్శించారు. మండల రిసోర్స్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ పాఠశాల నిర్వహణ పై ఎంఈవోలు జాను ప్రసాద్, జగ్గారావుతో కలసి చర్చించారు. అనంతరం ఇక్కడ సిబ్బంది శ్రీనివాసరావు, సత్తిబాబుతో కలసి పాఠశాల నిర్వహణ ప్రదేశం లోసింగి వెళ్లారు. పాఠశాల నిర్వహణను పరిశీలించి అక్కడ బోధకుడితో ఆదివాసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. తరచూ ఈ పాఠశాలను సందర్శించాలని సిబ్బందికి సూచించారు.

కొత్త అధికారుల బాధ్యతల స్వీకారం



ఎంపీడీవో సాంబశివరావు



తహసీల్దార్ భాగ్యవతి



ఎస్ఐ భాస్కరరావు



ఎంపీడీవో పార్థసారథిని సత్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

కె.కోటపాడు : మండల తహసీల్దార్‌గా పి.భాగ్యవతి, ఎంపీడీవోగా ఎ.ఎ.సాంబశివరావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పాయకరావుపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించిన **సాంబశివరావును** కె.కోటపాడు ఎంపీడీవోగా **నియమించారు. ప్రస్తుత** ఎంపీడీవోగా కార్యాలయ **సూపరింటెండెంట్ అప్ప**లరాజు వ్యవహరిస్తున్నారు. **రాంబిల్లి తహసీల్దార్‌గా** బాధ్యతలను నిర్వహిస్తున్న **పి.భాగ్యవతిని కె.కోటపా**డుకు బదిలీ చేశారు. ఇక్కడ **తహసీల్దార్‌గా విధులను** నిర్వహించిన జె.రమేష్ **బాబు ఎస్.రాయవరం** తహసీల్దార్‌గా బదిలీపై **వెళ్లారు. విధుల్లో చేరిన** ఎంపీడీవో సాంబశివరావుకు, **తహసీల్దార్ భాగ్యవతికి** ఆయా కార్యాలయాల సిబ్బంది స్వాగతం పలికారు.

బుచ్చెయ్యపేట ఏఎస్ఐగా భాస్కరరావు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట అదనపు ఎస్ఐగా ఎన్. భాస్కరరావు బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం స్పెషల్ బ్రాంచి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్ అదనపు ఎస్ఐగా నియమించారు. మంగళవారం ఆయన విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ అదనపు ఎస్ఐగా విధులు నిర్వహించిన నాయుడును జిల్లా కేంద్రానికి బదిలీ చేయగా ఇటీవల అతను పదవీ విరమణ చేశారు. మూడు నెలలుగా ఖాళీగా ఉన్న ఏఎస్ఐ పోస్టును అధికారులు ఇపుడు భర్తీ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన అదనపు ఎస్ఐని సిబ్బంది అభినందించారు.

నూతన ఎంపీడీవోగా అప్పారావు

మాడుగుల రూరల్ : మాడుగుల నూతన ఎంపీడీవోగా కొంకి అప్పారావు నియమితులయ్యారు. ఆయన కోనసీమ జిల్లా కరప ఎంపీడీవోగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. అప్పారావు గతంలో ఇక్కడ ఈఓపీఆర్‌డీగా పనిచేశారు.

నూతన తహసీల్దార్‌గా రమాదేవి

స్థానిక తహసీల్దారుగా కె.రమాదేవి నియమితులయ్యారు. ఈమె విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పి.వి.రత్నం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్నారు.

చోడవరం : రావికమతం మండలం తహసీల్దార్‌గా బి. వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మహేశ్వరరావు మునగపాక బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకటరమణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీవో పార్థసారథికి సత్కారం

నాతవరం :ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన పోలుపర్తి పార్థసారథిని ఎంపీపీ లక్ష్మణమూర్తి పలువురు సర్పంచులు కలిసి అభినందనలు తెలిపారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో హనుమంతరావుకు సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం జిల్లా భీమిలి మండల ఎంపీడీవోగా బదిలీ అయింది. ఆయన స్థానంలో పార్థసారథి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

భారీ అన్న సమారాధన



మాడుగులలో అన్న సమారాధన



అన్నదానంలో పాల్గొన్న మెగా ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

మాడుగుల రూరల్ : వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా, మాడుగుల బస్ స్టాండ్ వద్ద మెగా ఫ్రెండ్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలో గల ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

మాడుగుల : స్థానిక ఇండియన్ బ్యాంకు వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీనాదు వెంకటరత్నాలమ్మ జ్ఞాపకార్థం మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్న సమారాధనలో పాల్గొన్నారు.

వరద బాధితులకు అయ్యన్న విద్యార్థుల వితరణ



సీఎంఆర్ఎఫ్‌కు నగదు చెక్కు నమూనాను ఎమ్మెల్యేకు అందిస్తున్న ఖాసిమ్

కె.కోటపాడు : విజయవాడలో వరద బాధితులకు కె.కోటపాడు అయ్యన్న విద్యార్థులు ఆర్థికంగా అండగా నిలిచారు. పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.1, 53,650 నగదు చెక్కు నమూనాను మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి అందించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, రిటైర్డ్ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, రొంగలి మహేష్, సబ్బవరపు రామునాయుడు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

మాడుగుల నియోజకవర్గంలో రెండు చోట్ల పరిశ్రమలను ఏర్పాటు చేసే దిశగా చర్యలను తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎ.కోడూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎ.కోడూరు గ్రామాభివృద్ధికి రూ.75లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ పనులు పూర్తి చేస్తే మరిన్ని నిధులు గ్రామానికి కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సర్పంచ్ అక్కునాయుడు, మాజీ సర్పంచ్ మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్, అచ్చింనాయుడు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో చేరిన వర్షం నీరు



వర్షం నీటిని బయటకు గెంటుతున్న శానిటేషన్ సిబ్బంది

నర్సీపట్నం : కురిసిన భారీ వర్షానికి ఏరియా ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో వర్షం నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా దంచి కొట్టిన వర్షానికి ఎమర్జెనీ వార్డులో వర్షం నీరు భారీగా వచ్చి చేరింది. ఎమర్జెనీ వార్డు, డాక్టర్ వేచి ఉండే గది, సిబ్బంది ఉండే ప్రదేశంలో వర్షం నీరు చేరడంతో చిందరవందరంగా మారింది. ఆస్పత్రి వచ్చిన రోగులు, సిబ్బంది వర్షం నీటితో ఇబ్బంది పడ్డారు. శానిటేషన్ సిబ్బంది అతికష్టం మీద ఎమర్జెన్సీ వార్డు ప్రాంతంలో చేరిన వర్షం నీటిని అతి కష్టం మీద బయటకు గెంటి శుభ్రం చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా భారీగా వర్షం నీరు చేరడంతో వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

నర్సీపట్నం: భగత్ సింగ్ జయంతి పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ తీతాకృష్ణ ఈ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. విజేతలకు బహుమతులు అందజేసారు.ఈ పోటీల్లో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు రాజు, మోహన్, స్వామి, వరహాలు పాల్గొన్నారు.